కొత్త వంగడాల సమాచార పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుధారాణి, అధికారులు, శాస్త్రవేత్తలు

వ్యవసాయ పరిశోధనలను రైతులకు చేర్చాలి

- ప్రతి రైతుకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలి
- జయశంకర్ విశ్వ విద్యాలయం డైరెక్టర్ సుధారాణి
- నల్లగొండలో దక్షిణ తెలంగాణ వ్యవసాయ అధికారుల సమావేశం

నల్లగొండ, మార్చి 21 : విశ్వ విద్యాయాల్లో చేస్తున్న పరిశోధనలు రైతులకు చేర్చే విధంగా ప్రతి శాస్త్రవేత్త చర్యలు తీసుకోవాలని, దాంతో 25శాతానికిపైగా విస్తరణ సేవలు అందుబాటులోకి వచ్చి సత్ఫలితాలు వస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం విస్తరణ డైరెక్టర్ వి.సుధారాణి అన్నారు. నల్లగొండ కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో దక్షిణ తెలంగాణ వ్యవసాయ అధికారుల సలహా మండలి ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 11జిల్లాలకు సంబంధించిన వ్యవసాయ అధికారులు, ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు హాజరై 2023 యాసంగి, వానకాలం సీజన్‌లో పంటల పరిస్థితి, సాధించిన ప్రగతి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు పూర్తి చేసిన తర్వాత సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పరిశోధన ఫలితాలు ప్రతి రైతుకు అందించగలిగినప్పుడే ఉపయోగం ఉంటుందని తెలిపారు. శాస్త్రవేత్తలు విస్తరణాధికారులు మమేకమై వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరుస్తూ కొత్త పుంతలు తొక్కించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పప్పు దినుసులు, నూనె గింజల పంటల విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నదని, రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కలిగించాలని చెప్పారు. ప్రతి సీజన్‌లో రైతుకు కావాల్సిన అవసరాలు తెలుసుకొని ఆ దిశగా ముందుకు సాగాలని తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే వానకాలంలో వేసే పంటల సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు ఏయే పంటలు వేయాలి అనే దానిపై పక్కా ప్రణాళికతో ఉండాలని సూచించారు. అనంతరం వ్యవసాయ సహ పరిశోధన డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది వ్యవసాయ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ రెండు సీజన్లలో రైతుల కోసం చేసిన పరిశోధనలు, వారికి కల్పించిన అవగాహన సదస్సులను వివరించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్, ఆయా జిల్లాల వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు భరత్ భూషన్, అనిల్ కుమార్, లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, సుల్తాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొలనుపాకలో ఎలమ్మగుడి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న గౌడసంఘం నాయకులు

రోడ్డు పనులకు శంకుస్థాపన

ఆలేరురూరల్, మార్చి 21 : మండలంలోని కొలనుపాక గ్రామంలో గల రేణుకా ఎల్లమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మాణ పనులకు గురువారం గౌడ ఐక్యసాధన సమితి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు భీమగాని సంతోష్‌గౌడ్ మాట్లాడుతూ ఉగాది పండుగను ఎల్లమ్మ గుడి ఆవరణలో ఘనంగా జరుపుకొనేందుకు వీలుగా రోడ్డు వసతి ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాపరాజు, ఆనందం, భిక్షపతి, సోమలింగం, రమేశ్, పాండు పాల్గొన్నారు.

పల్లెర్లలో పొలాల్లో చిక్కుకున్న నెమలిని అటవీశాఖ అధికారికి అప్పగిస్తున గ్రామస్తులు

అటవీశాఖ అధికారులకు నెమలి అప్పగింత

ఆత్మకూరు(ఎం), మార్చి 21 : నీటి కోసం వచ్చిన నెమలి గురువారం మండలంలోని పల్లెర్ల గ్రామంలో నిమ్మరెడ్డి నర్సిరెడ్డి నరేందర్‌రెడ్డికి చెందిన వరి పొలంలో చిక్కుకుంది. గమనించిన రైతులు నెమలిని పట్టుకొని అటవీశాఖ సెక్షన్ అధికారి ఎల్లేశ్‌కు అప్పగించారు. నెమలిని కాపాడి తమకు అప్పగించిన రైతులను అటవీశాఖ అధికారి అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

ప్రజా సమస్యలపై పోరాడే వారినే గెలిపించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

భువనగిరి అర్బన్, మార్చి 21: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే వ్యక్తులనే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు కోరారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ స్థానానికి సీపీఎం అభ్యర్థిగా ఎండీ జహంగీర్ పోటీ చేయనున్నట్లు తెలిపారు. గతంలో ఈ నియోజకవర్గం నుంచి రావినారాయణరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిన ఘనత ఇక్కడి ప్రజలకు ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కారం సీపీఎంతో మాత్రమే సాధ్యమన్నారు.

పార్టీ అభ్యర్థిని గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్, కొండమడుగు నర్సింహ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దోనూరి నర్సిరెడ్డి, దాసరి పాండు, దయ్యాల నర్సింహ, బబ్బూరి పోశెట్టి, మాయ కృష్ణ, గడ్డం వెంకటేశ్, వనం రాజు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే ఉపేక్షించం

- మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అసిస్టెంట్ డైరెక్టర్ రాజారాం

సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ రాజారాం

వలిగొండ, మార్చి 21 : అవినీతికి పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అసిస్టెంట్ డైరెక్టర్ రాజారాం హెచ్చరించారు. మండలంలోని వెలువర్తి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు అవినీతికి పాల్పడినట్లు సంఘం సభ్యుల ఫిర్యాదుపై గురువారం సంఘం ఆవరణలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యక్షుడిపై వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహిస్తామన్నారు. సంఘం రికార్డులను స్వాధీనం చేసుకొని పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామన్నారు. విచారణలో అవినీతి జరిగినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామన్నారు. విచారణ సందర్భంగా సంఘం సభ్యులు పదేండ్ల నుంచి సంఘంలో ఎలాంటి లావాదేవీలు చూపించలేదన్నారు. విచారణ జరుగుతున్న సమయంలో సంఘం అధ్యక్షుడు, సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కార్యక్రమంలో మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, రవి నాయక్, సూరబోయిన దయాకర్, బత్తెపు శేఖర్, కలువల లింగస్వామి, నిమ్మల శేఖర్, గుర్రాల రాములు, చెవ్వ మధు, మారబోయిన పరుశురాం, అంజ య్య, జనార్దన్, చెవ్వ పవన్, నిమ్మల ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హైదరాబాద్‌కు తరలి వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

గుండాల, మార్చి 21 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలానికి చెందిన పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీఓ 51ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్‌కు వినతి పత్రం అందించేందుకు గురువారం వారు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఇటికాల పరుషరాములు, కోమటి శ్రీను, అన్నెపర్తి గిరిబాబు, అన్నెపర్తి యాదయ్య, పందుల ఇందిర, వంగాల వెంకటమ్మ, వంగాల యాదయ్య, మారోజు నర్సింహాచారి పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు వీడ్కోలు

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

చౌటుప్పల్, మార్చి 21 : చౌటుప్పల్ పట్టణంలోని జయశ్రీ గార్డెన్‌లో గురువారం స్థానిక మాతృశ్రీ డిగ్రీ కళాశాల విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. జూనియర్లు సీనియర్లకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎం.సుభాశ్‌రెడ్డి, డైరెక్టర్ ఎం.శ్రావణి, ప్రిన్సిపాల్ బి. మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఎంపీపీ

వీరారెడ్డిపల్లి పల్లె దవాఖానను సందర్శించిన ఎంపీపీ సుశీలారవీందర్

తుర్కపల్లి, మార్చి 21: ప్రభుత్వ దవాఖానలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ బూక్యా సుశీలా రవీందర్ అన్నారు. మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలోని పల్లె దవాఖానను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అందుతున్న వైద్య సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఆమె వెంట ఎంపీటీసీ శ్రీనివాస్‌యాదవ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పశు పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి

వెంకటాపురంలో పశువులకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి జనార్దన్

తుర్కపల్లి, మార్చి21: పశుపోషణలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని పశువైద్యాధికారి ఎల్. జనార్దన్ సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 21 : పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీని గురువారం లెక్కించారు. నాలుగు నెలల హుండీ ఆదాయం రూ.3,66,625 లక్షలు వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకాధికారి చెట్టెడి వెంకట్‌రెడ్డి, ఈఓ జి. నరేందర్‌రెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 9,099 మంది హాజరు

భువనగిరి అర్బన్, మార్చి 21: పదో తరగతి వార్షిక పరీక్షలు గురువారం జిల్లా వ్యాప్తంగా 51 కేంద్రాల్లో కొనసాగాయి. మూడో రోజు ఇంగ్లిష్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 9,123 మంది విద్యార్థులకు గానూ 9,099 మంది హాజరుకాగా 24 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ కె.నారాయణరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీఈఓతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

ఇసుక లారీ పట్టివేత

వలిగొండ, మార్చి 21 : మండలంలోని గోకారం గ్రామ శివారులో మూసీ పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరీని బుధవారం రాత్రి పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీ ఓనర్ కర్నాటి శివశంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 21 : పట్టణ కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ద్రవిడ వేద అధ్యయనం, నివేదన హారతి, తీర్థ ప్రసాద గోష్ఠి, ఆరాధన తొలక్కం, అధ్యయన ఉత్సవాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంకం వినోద్, స్థానిక వార్డు కౌన్సిలర్ మోటే రజితారాజు, నాయకులు ఈపూరి ముత్యాలు, మెరుగు యతీనందం, కర్నాటి బాలరాజు, చింతకుంట్ల కృష్ణారెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

యాదగిరిగుట్ట, మార్చి21: తాళం వేసిన ఇంట్లో గురువారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు యాదగిరిగుట్ట సీఐ రమేశ్ తెలిపారు. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన చెరుకు వెంకటేశ్వర్ ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లారు. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ.18 వేల నగదు, ఐ ఫోన్, రెండు స్మార్ట్ వాచ్‌లు, 6 తులాల వెండి పట్టీలను దొంగిలించిన్నట్లు వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



స్వామి, అమ్మవార్ల వెండి మొక్కు జోడు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా స్వామి అమ్మవార్ల జోడు సేవోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి 21: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం స్వామి, అమ్మవార్ల వెండి మొక్కు జోడు సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయ వెలుపలి ప్రకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించారు. స్వామివారిని గరుడ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చీ వాహనంపై వేంచేపు చేసి తిరువీధుల్లో ఊరేగించారు. స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలను ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం స్వామివారికి దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు.

పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.19,70,020 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

- డీసీపీ రాజేశ్‌చంద్ర

బీబీనగర్, మార్చి 21 : పలు బైక్‌లను దొంగిలించిన వ్యక్తిని, మహిళ మెడలోంచి పుస్తెల తాడు అపహరించిన నిందితుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేసినట్లు డీసీపీ రాజేశ్‌చంద్ర తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భువనగిరి మండలం నమాత్‌పల్లి గ్రామానికి చెందిన ఎల్లెంల మధు ఇంటర్ మధ్యలో మానేసి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వచ్చిన డబ్బులు సరిపోక సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో దొంగతనాలు ప్రారంభించాడు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం తన స్నేహితుడు సాయికుమార్ బైక్‌ను తీసుకెళ్లి బస్వాపురం గ్రామ శివారులో బైక్‌పై ఇద్దరు వెళ్తుండగా వారిని వెంబడించి వెనక కూర్చున్న మహిళ మెడలోని పుస్తెల తాడు లాక్కొని పారిపోయాడు. సదరు బంగారాన్ని భువనగిరిలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నట్లు డీసీపీ తెలిపారు. బాధితురాలు పులి చంద్రకళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎల్లెంల మధు గురువారం ఉదయం 8 గంటలకు బైక్‌పై రాయగిరి చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు ఆయన వివరించారు. నిందితుడిని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పర్చినట్లు పేర్కొన్నారు.

బైక్‌ల దొంగ ..

బీబీనగర్ మండలంలోని కొండమడుగు గ్రామం మాధవరెడ్డి కాలనీకి చెందిన కుతాడి భానుచందర్ (20) జల్సాలకు అలవాటుపడి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో 26 బైక్‌లను దొంగిలించి వాటిని ఇతరులకు విక్రయించాడు. బైక్ దొంగతనాలపై హైదరాబాద్‌లోని మేడిపల్లి, ఉప్పల్, ఓయూ సీటీ, బీబీనగర్ పోలీస్టేషన్ల పరిధిలో 18 కేసులు నమోదయ్యాయి. గురువారం మండలంలోని కొండమడుగు మెట్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా బైక్‌పై వెళ్తున్న భానుచందర్ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. పట్టుబడిన వాహనాల ఓనర్లను గుర్తించి వాటిని అందిస్తామన్నారు. గ్రామాల్లో నంబర్ ప్లేట్ లేకుండా, నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేసినట్లు కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఆయన వెంట ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, సీఐ ఎం. ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ శివ నాగప్రసాద్, రమేశ్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డుపై బైక్‌లను నిలిపి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పాటిమట్లలో ఆర్టీసీ బస్సులు ఆపాలని ఆందోళన

మోత్కూరు, మార్చి21: మండలంలోని పాటిమట్ల గ్రామంలో ఆర్టీసీ బస్సులను ఆపాలని కోరుతూ గురువారం గ్రామస్తులు ఆందోళన చేశారు. గ్రామంలోని బస్‌స్టేజీ వద్ద బైక్‌లను అడ్డం పెట్టి ఆందోళన చేశారు. గతంలో తమ గ్రామంలో బస్టాండ్ వద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, ఆర్డినరి బస్సులను ఆపి ప్రయాణికులను ఎక్కించుకెళ్లే వారని గ్రామస్తులు తెలిపారు. కొన్ని నెలలుగా బస్సు డ్రైవర్లు బస్సులను ఆపకుండా వెళ్తున్నారని. దాంతో తాము ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. విషయాన్ని ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు బస్సులను బస్ స్టేజీ వద్ద నిలిపి ప్రయాణికులను తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలోఎం. వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, జి. శ్రీను, నవీన్, మల్లయ్య, యాదగిరి, నర్సయ్య, వెంకన్న, సురేశ్, రాములు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

స్పీకర్ ఆఫ్ ట్రైనర్లుగా శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 21 : ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొంది స్పీకర్ అండ్ ట్రెయినర్‌గా గుర్తింపు పొందిన 9 మంది ఉపాధ్యాయులను గురువారం స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ గురుకుల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అనంతారం ప్రిన్సిపల్ పి, వెంకటేశ్వర్‌రెడ్డి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా మోటివేషన్ నిర్వహించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో స్పీకర్ అండ్ ట్రైనర్‌గా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మహేశ్, శ్రీనివాస్, రజిత, సుభాషిణి, శ్రీవాణి, శ్రీలత, స్నేహలత, కవిత, వరలక్ష్మి, మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఎన్నిక

ఆలేరురూరల్, మార్చి 21 : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్లను గురువారం ఎన్నుకున్నారు. కొలనుపాక జడ్పీహెచ్ఎస్ చైర్‌పర్సన్‌గా పైసా పద్మ, ప్రాథమిక పాఠశాలకు గుండె సంతోష, శ్రీనివాస్‌పురం జడ్పీహెచ్ఎస్‌కు పి. స్వరూప, శారాజీపేట ప్రాథమిక పాఠశాలకు కడారి నాగమ్మ, మందనపల్లి ప్రాథమిక పాఠశాలకు తమ్మడి మాధవి, రాఘవాపురం పాఠశాలకు గడిపె లావణ్య, కొల్లూరు జడ్పీహెచ్ఎస్‌కు దూపాటి కవిత, రాజనగరం పాఠశాల చైర్ పర్సన్‌గా శ్రీవాణి ఎన్నికయ్యారు.

ఆత్మకూరు(ఎం)లో..

ఆత్మకూరు(ఎం): అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్లను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆత్మకూరు(ఎం) ఉన్నత పాఠశాల చైర్‌పర్సన్‌గా కోరె పావని, ప్రాథమిక పాఠశాలకు కోల శిరీష, కస్తూర్బాగాంధీ పాఠశాలకు తవిటి అనిత, కప్రాయపల్లి ఉన్నత పాఠశాలకు కొంగరి రేణుక, కొరటికల్ ప్రాథమిక పాఠశాలకు సోలిపురం రమణమ్మ ఎన్నికయ్యారు.

కొలనుపాక జడ్పీహెచ్ఎస్ చైర్‌పర్సన్ పద్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గరిడేపల్లి, మార్చి 21 : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన చింతోజు ఉపేంద్రాచారి (25) రాత్రి 8.30 గంటల సమయంలో తన బైక్‌పై గరిడేపల్లి నుంచి సూర్యాపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పొనుగోడు గ్రామం వెలుపల గల హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను దాటిన తర్వాత గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదంపై పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని హుజూర్‌నగర్ ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించినట్లు తెలిపారు.